# విషమ పరీక్ష

**భా**ర్య పవిత్రతను పరీక్షించిన మూర్ఖుల కథలు ప్రతి సారస్వతంలోనూ ఒకటి రెండు ఉండి తీరాలల్లే ఉంది. ఉంటే ఉన్నై అందుకు నేనెన్నడూ చింతించను. కథలకూ జీవితానికీ ఎన్నడూ ఎటువంటి సంబంధమూ ఉండదు. ఉండకపోవడమే మంచిదేమో కూడానూ!

కాని రాజేశ్వర్రావ్వంటి బెదురుగొడ్డు, అసూయపూరిత మృగం నా దగ్గరకొచ్చి తన భార్యను విషమ పరీక్షలో పెడతానని చెప్పటం నాకు చాలా అసహ్యమేసింది.

"ఇప్పుడంత కొంపమునిగిన పనేం జరిగింది?" అన్నాను.

రాజేశ్వర్రావు మొహం పాలిపోయి ఉంది. మాట్లాడుతుంటే మాట తడబడ్డది.

"మరేం లేదు - నువ్వు వేరే దురూహ పోకు! - నాకెప్పుడూ లేదు - ఇప్పుడూ లేదు! - అసూయన్న పదార్థం! - కాని - "

"అబద్ధం! మేమెవరమైనా నీ భార్యతో చనువుగా మాట్లాడితే నువ్వెంత లోపల కుళ్ళేది నీ శరీరంమీద ప్రతి రోమంలోనూ సూచన అవుతూనే ఉంటుంది. నీకే ఆ సంగతి తెలీదా? లేక నన్నంత కనుక్కోలేని వాని కింద కట్టావా?"

రాజేశ్వర్రావు కాస్సేపు పరధ్యానంగా పక్కకు దృష్టి తిప్పి చివరకు నా వంక తిరిగి "నా పెళ్ళాన్ని చూస్తే నాకంత ప్రేమ అని కనుక్కోలేవా? నా పెళ్ళామనే కాదు, నాకు ఇష్టమైన గుండుసూదైనా సరే ఇంకోడు తాకితే సహించలేను. నా ప్రకృతి అదీ! దాన్ని అసూయ అనటం ఎందుకు? నువ్వు నీ భార్యతో సుఖంగా ఉంటే ఓర్చలేకపోతే అదీ అసూయ. తెలుగులో రెండు రకాల అసహనానికి రెండు మాటలు లేవు. కనక రెంటినీ ఒకటే విధంగా చూడటం ఏం ధర్మం?" అన్నాడు.

నాకు మండిపోయింది.

"మాటలు నేర్చిన శునకాన్ని - ఏదీ సామెత? అట్లా వుంది నువ్వనేది. నీ ప్రేమలో గౌరవం లేదు. ఉంటే అసూయ ఉండదు. రెండు రకాల ప్రేమ కూడా ఉంది. నీకున్నది పాడు రకం. కాబట్టే నేను అసూయ అనేమాట ఎత్తను, నువ్వు ప్రేమ అనేమాట యెత్తకు.

ఇప్పుడు నీ విషమ పరీక్ష కొద్దాం. ఎందుకు విషమ పరీక్ష? అసలు పరీక్షలే వెధవ్వి. అందులో విషం కూడా ఎందుకు?"

"విషం కాదు విషమం!"

"నాకు రొండూ ఒకటిగానే ఉన్నై పామరుణ్ణి కావటంచేత. అట్టే చూస్తున్నాను. నీకు పరీక్షలంటే చాలా ఇష్టంగా ఉంది. మొన్న ఇట్లాగే పాపం లక్ష్మీ నరసింహాన్ని చేశా ఒక వెధవ పరీక్ష. వాడు డబ్బు దగ్గర కాస్త దుర్బలుడు. వాడికి నేను చెబుతూనే ఉంటిని, నువ్వేమో వాడిచేత డబ్బు ఖర్చు పెట్టించాలని ప్రయత్నం చేసి, వాడి తొంటచెయ్యి బైటపడగానే వాడు స్నేహపాత్రుడు కాడని తీర్మానిస్తివి! అసలు పరీక్షలు చేయటానికి నువ్వెవడంటాను? నువ్వొక్క పరీక్షకాగుతావా? మేమెవరం నీమీద పరీక్షలు చేయలేదు కనుక మనిషల్లే ఉన్నావు. భద్రం. త్వరలోనే నీ నెత్తిన దెబ్బ పడగల్దు!"

రాజేశ్వర్రావు మొండి బండ పురుగు. వాడికి నా మాటలకు కోపమూ రాలేదు. భయమూ కలగలేదు!

"నువ్వు చెప్పింది నిజమేననుకో. నా పెళ్ళాం విషయం పరీక్ష తప్పదురా! కారణం అడక్కు. నా భార్య వస్తుతహా మంచిదే. కాని బ్రహ్మకైనా పుట్టు రిమ్మ తెగులు. నీకు తెలీనిదేముంది? రోజూ ఏడు గంటలు పగలు ఇంట్లో ఉండనుగదా, ఇంట్లో మూడోదిక్కు లేదుగదా! నాకోసం అనేకమంది స్నేహితులూ వాళ్ళూ వస్తూ పోతుంటారు కదా!.... ఒక్కసారి పరీక్ష చేయనియ్యి! నా మాట విను!"

అమాంతం వాడిమీదపడి మెడ మెలేసేద్దామన్న కోపం వచ్చింది వాడి మీద నాకు. దాన్నంతా తొక్కిపెట్టి పైకి "ఎందుకు నా అనుజ్ఞ ఇందుకు? నీ యిష్టం వచ్చినట్లు చేసుకో! తరవాత బెడిసికొడితే వ్యవహారం, నన్ను కూడా పూచీగా వుంచటానికా నాతో ఎందుకీ గోల?" అన్నాను.

"అట్లా అడుగు చెబుతాను. ఈ పరీక్ష నీ ద్వారా జరగాలిసుంది!"

"నేనా! –"

"ఎందుకు నవ్వుతున్నావు?"

నాకు నవ్వాగలేదు. నేను మళ్ళీ తెప్పరిల్లుకోటానికి చాలాకాలం పట్టింది. నేను నవ్వటం దాదాపు అయిపోయి కళ్ళు తుడుచుకొంటూండగా రాజేశ్వర్రావు ప్రశ్న మళ్ళీ వేశాడు.

"ఏం లేదులే! నేను కూడా నీ పెళ్ళాంతో... " రాజేశ్వర్రావు నిర్ఘాంతపోయినాడు. మొహం పాలిపోయింది.

"ఎబ్బే! ఛా!' నాకటువంటి అనుమానం ఎన్నడూ –కల్లోనైనా–ఛీ!" వాడిస్తున్న

సమాధానం నాకల్లే లేదు; వాడి మనస్సును వాడే సమాధానపరుస్తున్నట్లు కనబడ్డాడు కాని.

"సరే, నేను నీ పనిముట్టుగా ఉండటాని కొప్పుకున్నాను. నన్నేం చెయ్యమన్నావు?"

"అట్లా అడుగు చెబుతాను. ఇవాళ రాత్రి ఏడు గంటలకు నువ్వు మాయింటికి వెళ్ళి నా భార్యను వంచించటానికి ప్రయత్నం చేసి నాకు ఫలితం తెలియచెయ్యాలి. అంతే!"

నేను చాలాసేపు యోచించి, "సరే! నీ భార్య వొప్పుకుంటే?" అన్నాను.

రాజేశ్వరరావు కటువంటి సంశయమే కలగలేదని స్పష్టమయింది నాకు; కాని యిటువంటి అనవసరమైన అనుమానాలతో కాలయాపన చెయ్యకపోవటానిక్కూడా వాడు తీర్మానించుకున్నట్టు స్పష్టమయింది.

"దాని ప్రకృతి అటువంటిదని నిర్ధారణ అయితే, చెప్పేదేముంది? వదిలేస్తాను."

"మరి నీ ప్రేమ?"

"గుడ్డి ప్రేమన్న మాట!"

"ఎట్లాగో గుడ్డి ప్రేమన్న మాటేగా నీ పరీక్షా ఫలితం తేలే వరకూ? దాంతో ఎట్లా ఈదుకొస్తున్నావు?"

"ఈదుకురావటం కష్టమనిపించే కదూ పరీక్ష?"

ప్రతి ప్రశ్నకూ సమాధానం సిద్ధంగానే వుంది.

"ఇంతకూ మరిచిపోయినాను! నీ పెళ్ళాం నాకు లోబడితే నువ్వేం చేస్తావనికాదు నేనడిగింది? నేనేం చెయ్యాలి?"

రాజేశ్వర్రావు కంగారుపడ్డాడు.

"నువ్వా? నువ్వు చేసేదేముంది? మాట్లాడకుండా బయటికొచ్చెయ్యాలి, ఇంకా చేసేదేముంది?"

"అవుననుకో; నీ పెళ్ళాం నన్ను స్వీకరించటానికొప్పుకునే పక్షాన – ఎట్లాగూ నీకావిడ పనికిరాదు. కనక నాకేమీ అభ్యంతరం లేకపోతే – ఏది?"

రాజేశ్వర్రావు మొహం అసూయతో అసహ్యంగా అయిపోయింది. వాడు నా వంక తినేటట్టు చూస్తూ, "నువ్వింత – నువ్వింత – నే నెప్పుడూ అనుకోలేదు!" అన్నాడు.

"అందుకే అడిగాను! నీకు నిజంగా అటువంటిదానికై అభ్యంతరం ఉంటుందో లేదో తెలుసుకోటానికే! – సరే! ఇప్పుడు తేలిపోయింది, నన్ను గురించి నువ్వేమీ భయపడనక్కరలేదు. ఇది ఇంతకూ ఉత్తుత్త పరీక్షన్న మాట. లేకపోతే పరీక్షలో ఫేలయినా నీ భార్యమీద, నీకంత అభిమానం ఎందుకుంటుంది?'

"పొరపాటున నీ దగ్గిరికి సహాయం అపేక్షించి వచ్చినందుకు నన్నెంత ఏడిపిస్తున్నావురా? నా నెత్తురు పిండేస్తున్నావా! నీ కిష్టం లేకపోతే చెప్పరాదూ? నా తిప్పలు నే పడతానుగా?"

"ఏ రాయయితేనేం తల పగల కొట్టుకోడానికి? నేనే కాని ఇటువంటి అవివేకపు ఆలోచన చెయ్యటం ఒక తప్పు, దానిని మూడో మనిషికి చెప్పటం మరో తప్పు. ఆ మూడో వాడు నా వంటి పరాయివాడు కావటం మూడో తప్పు. ఇంత వాణ్ణప్పటి నుంచి మీ ఇంట్లో తిరుగుతున్నానే కాని నీ అనుమానం నా అవమానంగా భావించవలసినంత దగ్గర బంధువును కానుగా! ఇప్పుడు మళ్ళీ నాలుగో మనిషిని అందులోకి లాక్కురావటం ఎందుకు?"

"నువ్వు పరాయి మనిషివా? స్నేహితం ముందర ఏ చుట్టరికం ఆగుతుంది?"

"ఆగదు నిజమే. కాని, నీ అవమానం నాదని నువ్వు నమ్మితే నన్ను చూసి అసూయ పడతావా, నీ భార్య విషయమై?"

"అబద్ధం. నే నెన్నడూ అసూయ పడలేదు. ఇంకా శాస్త్రి విషయంలో–"

వాణ్ని చూస్తే నాకు మళ్ళీ ఒక తెర అసహ్యం వచ్చింది. నైచ్యం ఉండటం కన్నా దాన్ని కప్పిపెట్టలేక పోవటం తప్పేమో ననుకుంటాను!

"ఒరే! వెధవ కింద చూడకు! నేను కనుక్కోలేననా?"

"నీ అసూయ చూసి మీ ఇంటికి రానివాణ్ణే? కాని, దురదృష్టవశాత్తూ నాకు నీతోపాటు నీ భార్య కూడా స్నేహితురాలయింది. మా కుటుంబంలో వాళ్ళని ఏ విధంగా చూస్తానో సరోజిన్ని కూడా ఆ విధంగా చూడటం అలవాటయింది. అందుచేత నీ వెధవ అసూయను కూడా లెక్కచెయ్యకుండా ఇంకా మీ గడప తొక్కుతున్నాను."

"అబ్బ! అయిపోనియ్యవోయ్! అసలు సంగతి చెప్పు!"

"సరే, ఇంకేం? ఇక్కడికి రా ఆరున్నరకు. ఇద్దరం కలిసి మీ ఇంటి దాకా పోదాం. నువ్వు వీధి చివర ఆగు, నేను లోపలికెళ్ళి అయిదు నిమిషాల్లో వచ్చేస్తాను. రాత్రికి చీకటా, వెన్నెలా?"

"చీకటే... కాని నువ్వు ప్రయత్నం బాగా చెయ్యాలి సుమా. నాయుడివి, నీకు చెప్పేదేముంది? లేకపోతే నా ప్రయత్నం వ్యర్థమౌతుంది" అన్నాడు రాజేశ్వర్రావు లేస్తూ.

రాజేశ్వర్రావును వీధి చివర వదిలిపెట్టి వాడింటి ముందరికొచ్చి వాడిపేరు బెట్టి పిలిచాను. సరోజిని మేడ మీదినుంచి "లేరు!" అని కేక పెట్టింది.

"కిందికి వచ్చి ఒకసారి తలుపు తియ్యి సరోజిని."

మేడ దిగి వచ్చి తలుపు తీసింది. నేను లోపలికి వెళ్ళి తలుపు దగ్గిరిగా వేసి సరోజినితో మేడ మీదికి వెళ్ళాను.

"అట్లా కూర్చో సరోజినీ! పెద్ద చిక్కొకటి వచ్చిపడ్డది. నీకు నీ మొగుణ్ణి గురించి కలిగిన ఆదుర్దా నిన్ను గురించి వాడిక్కూడా కలిగింది. నిన్ను సమాధాన పరిచినట్టు వాణ్ణి సమాధాన పర్చలేకపోయినాను. అంతే భేదం!"

సరోజినికి - ఆడవాళ్ళందరికీ ఉన్న దొబ్బుడాయే - సమయంకాని సమయంలో కోపం వచ్చింది.

"నా విషయం ఆయన కనుమానం కలిగిందా? ఇంతే. మగవాళ్ళకు మెప్పులేదు!"

"అరవకు, నీ మొగుడు కిందనే ఉంటాడు... ఇప్పుడే ఆగ్రహిస్తే అసలు సంగతంతా ఎట్లా చెప్పగలను?"

సంగతంతా విని సరోజిని ఉక్రోషంతో యాడవటం మొదలుపెట్టింది. నేను మళ్ళీ ఆమెను కోప్పడాలిసొచ్చింది.

"నువ్వింత మతి లేకుండా ప్రవర్తిస్తే నేను చెయ్యదలచుకున్న పని చెయ్యకుండానే పోవలిసొస్తుంది. వాడిమీద నీకు కోపం వచ్చినప్పుడొక సంగతి మరిచిపోబోకు. మీ ఇద్దరికి కూడా మతి లేదు. మీరింకా బళ్ళో చదువుతూండాలిసిన పిల్లలు. ఒకరికొకరు తీసిపోరు. కనుక రాజాయి మళ్ళీ ఇటువంటి ఎత్తు ఎత్తకుండా చేసి చూస్తాను. అంతదాకా నన్ను పలకరించక చూస్తుండు, నేను మాట్లాడితే నా కడ్డం రాకు!"

నేను కుర్చీలోనుంచి లేచి బల్లమీద ఉన్న న్యూసు పేపరు దీపానికడ్డం పెట్టాను. వీథిలో నుంచున్న మనిషికి గదిలో దీపం ఆర్పేసినట్టు కనబడుతుంది. నేను యథా ప్రకారం కుర్చీలో కూర్చున్నాను.

"ఎందుకది?"

"శ్!"

నిశ్శబ్దం. నేను చెవులు రిక్కించి వినటం మొదలుపెట్టాను. అయిదు నిమిషాలకు మెల్లిగా కిర్రుమని శబ్దం అయింది. తరవాత మెట్లమీద చాలా కొద్దిగా అడుగుల చప్పుడయింది. నేను మళ్ళా లేచి లాంతరుకడ్డం తీసేసి కొంచెం బిగ్గరగా మాట్లాడటం మొదలు పెట్టాను.

"అవును, సరోజినీ! నువ్వనుమానించింది కేవలం పొరపాటు కాదు, రాజాయి ఇంకో ఆడదాంతో పోతున్నాడని రుజువు చెయ్యలేను కాని వాడు సాల నాగమ్మను చూసి ప్రతిరోజూ నవ్వటం, ఆ మహా ఇల్లాలు మళ్ళీ నవ్వటం జరుగుతూనే ఉంది. తరవాత ఆ వ్యాపారావిడ విషయం కూడా నాకు గట్టి అనుమానం ఉంది! ఇంకా ఈ విధంగానే -

ఎందుకూ? వాణ్ణే అడిగి కనుక్కోవచ్చు! రారా, రాజాయి! సమయానికొచ్చావు" అంటూ లేచి నేను వెళ్ళి గది తలుపు తెరిచాను. రాజాయి వాకిట్లో ఘోస్టల్లే నిలబడి ఉన్నాడు!

సరోజిని లేచి "ఏమండీ, నిజమేనా?" అంది.

"సరే నేను శెలవు తీసుకుంటాను. అరే, బ్రదర్, సారీ! నువ్వు చెప్పిందంతా మరిచిపోయినాను. ఆఫ్టరాల్ - ఫస్టప్లికెంట్ నీ భార్య! నీ భార్య" అంటూ నిష్క్రమించాను.

ఇప్పుడు నాతో ఇద్దరూ సరిగా మాట్లాడరు. మొగుడూ పెళ్ళాల మధ్య ఇరికిన వాడి దశ ఇంకో విధంగా ఎందుకుంటుంది?

*(ప్రచురణ వివరాలు అలభ్యం)*